# మెలకువ

మనిషి దాదాపు ఆరడుగుల ఎత్తు. తెల్లగా ఉతికి ఇస్త్రీ చేసిన ధోవతి లాల్చీ. తలమీద వెండి తీగెల్లాగా అక్కడక్కడా వెంట్రుకలు. ఆయన చిటికెన వేలు పట్టుకుని అయిదారేళ్ళ బూరి బుగ్గల పిల్ల... వాళ్ళు రోజూ ఇదే సమయంలో ఎదురౌతారు. ఈయన అప్పుడప్పుడూ ఒక పాతిక ముప్ఫై ఏళ్ళమ్మాయి స్కూటర్ మీద గువ్వలా ముడుచుకుని కూచుని కనిపిస్తాడు. అర్థమైంది. చిన్న పిల్ల ఆవిడ కూతురు. ఈ ముసలాయన పాపం వాళ్ళ దగ్గర వుంటున్నట్లున్నాడు. అప్పుడప్పుడూ కూరలు తెస్తూ కనిపిస్తాడు. అంత ముసలాయనకింకా పాతికేళ్ళ కూతురేమిటో? ఇవ్వాళ ఆయనే పలకరింపుగా నవ్వాడు. పాపం మాట్లాడే వాళ్ళు లేరేమో!

"మీరు సుశీలమ్మ పెనిమిటా?"అన్నాడు. పెనిమిటి ఈ మధ్య ఎవరూ వాడని పదం. పెద్దాయన కదా పాతమాట అలవాటు కాబోలు.. అవునన్నట్టు ఒక నవ్వు నవ్వి, 'సుశీల నా భార్య' అన్నాడు. ముసలాయన తన మొహంలోకి గమ్మత్తుగా చూసి మళ్ళీ నవ్వి తన గురించి చెప్పాడు.

ఇదే అపార్ట్‌మెంట్‌లో పై ఫ్లోర్‌లో వుండే కావ్యమ్మ తన మనమరాలు. ఈ పిల్ల ఆవిడ కూతురు.

పాపం కొడుకూ, కోడలూ లేరేమో. మనవరాలి దగ్గరుండాల్సొచ్చింది.

"మనవరాలి దగ్గరుంటున్నారా?" అన్నాడు కాస్త సానుభూతినింపుకున్న కంఠంతో.

"మనవరాలి దగ్గరుండడం లేదు. మనవరాలితో ఉంటున్నాను. దానికి సాయానికి" అన్నాడు నవ్వుకుంటూ కాస్త గర్వంగా. బూరిబుగ్గలు ఏదో కిచకిచలాడింది.

"ఈ బుడతకి నా దగ్గర బాగా అలుసు... రండి మా గూటికి... మంచి టీ ఇస్తా మాట్లాడుకుందాం కాసేపు" అన్నాడు. ముసలి వాళ్లు మనిషి దొరికితే వదలరు. ఇప్పుడు టీ

పెట్టమంటే మనవరాలు విసుక్కోదూ? ఈ ముసలాడికి అతిథులు కూడానా? అనేసి... పోన్లే పాపం పిలిచాడుగా.టీ వొద్దంటే సరి.

మనవరాలు లేదల్లే వుంది. తాళం తీసి లైట్లు వేశాడు. బుడత ఒక్క పరుగున చెయ్యి వదిలించుకుని టీవీ దగ్గర కూచుంది. టామ్ అండ్ జెర్రీ....

"కావ్యమ్మ పెనిమిటికి ముంబయ్ బదిలీ అయింది. రెండునెల్లయింది నేనొచ్చి. ఈవిడగారు స్కూల్ నించి వచ్చేసరికి ఎవరైనా ఇంట్లో వుండాలి. అందుకని వచ్చాను. అతనుంటే ఏదో చూసుకునే వాడు... ఏం తోచదు నాకిక్కడ. ఈవిడగారు చూసే కార్టూన్లన్నీ చూస్తూ వుంటా. ఈ పుస్తకం తిప్పుతూ వుండండి టీ పెట్టుకొస్తా..' అని లోపలికి పోబోయాడు.

"అయ్యో వద్దు సార్. మీరు పెట్టడమేమిటి?' అంటే నవ్వి, 'తాగి చెప్పండి' అని లోపలికి పోయాడు. నేరకపోయి తగిలించుకున్నా ననిపించింది. ఒక్కొక్కసారి అంతే...

అయిదు నిమిషాల్లో ట్రేలో రెండు గాజు కప్పుల్తో వచ్చాడు. నాలుగు ఉప్పు బిస్కట్లు కూడా పెట్టుకొచ్చాడు.

"ఈ గ్రీన్ టీ బావుంటుందని మీ సుశీలమ్మే చెప్పింది" అన్నాడు.

"ఏం చేస్తూ వుంటారు? అన్నట్టు మీ పేరడగలేదు సుశీలమ్మ పెనిమిటి అన్నాను ఏమనుకోవద్దు" అనడిగాడు.

"ఈశ్వర్ నా పేరు. మొన్నటిదాకా పనిచేశాను. రిటైరయ్యాను"

"అది తెలుసు. సుశీలమ్మ చెప్పింది. ఇప్పుడేం చేస్తూ వుంటారు?"

ఒక అర్థం లేని నవ్వు...పొద్దున్నే వాకింగ్, సాయంత్రం వాకింగ్. టీవీ...

బుడత మళ్ళీ ఆయన చెవిలో ఏదో రహస్యం చెప్పింది. లోపలికి పోయి చాక్లెట్ ఒకటి తెచ్చిచ్చి "ఇది ఇవ్వాళ్టి ఆఖరిది.." అని హెచ్చరించాడు. ఆయనకి కితకితలు పెట్టి తనూ కిలకిల లాడింది.

"నిజం చెప్పొద్దూ. నాకూ, మా బుడతకీ బాగా నచ్చే ప్రోగ్రామ్ ఇదే... ఈ ఎలుక మహా తెలివైంది." అన్నాడు.

తన గురించి చాలా చెప్పాడు. చెబుతూనే వున్నాడు.

అంతలో ఆయన లాల్చీ జేబులోని సెల్ మోగింది. అది బయటికి తీసి చూడగానే ఆయన మొహం వెలిగింది.

"మా జానకమ్మ... బెజవాడనించీ..." అన్నాడు. జానకమ్మ చాలా ఇష్టమైన మనిషిలా వుంది.

"మీరు మాట్లాడుకోండి... మళ్ళీ కలుద్దాం" అని బయటపడ్డాడు. ఆయన సెల్ చెవిలో పెట్టుకుని రెండో చేత్తో ట్రేని లోపలికి పట్టుకుపోయాడు.

తనూ లిఫ్టెక్కి తలుపులు సరిగ్గా వేసుకుని తన కలుగు లోపలికి వచ్చి తాళం తీసుకుని (తలుపు లాగి వేస్తే తాళం పడిపోతుంది... తాళంచెవి ఎప్పుడూ జేబులో వేసుకుని తిరగాలి) భద్రంగా మళ్ళీ తలుపేసి...లోపల అంతా చీకటి చీకటిగా వెగటుగా, చీదరగా... చెయ్యడానికేమీ లేనట్లుగా చేతులు కట్టేసినట్టు వుంది.

"ఎందుకలా చీకట్లో కూచోడం! లైటేసుకోవచ్చుగా..." అనే మందలింపుతో దీపం వేసింది. ఇంటి దీపం.

కిటికీ పక్కకి వాలుకుర్చీ లాక్కున్నాడు. కిందకి చూస్తే పార్కింగ్ అంతా వాహనాలు వచ్చి చేరుతున్నాయి. కలుగుల్లోకి ఎలుకలొచ్చేస్తున్నాయి. మిక్కీ మౌసులు, మిన్నీ మౌసులు. విజ్ఞాన భారంతో వొంగిపోయిన వీపుల్తో వచ్చిన పిల్ల మౌసులు... మౌసులు నొక్కీ నొక్కీ వేళ్ళరిగిపోయిన యువమౌసులు...

"నేను కొంచెం టీ పెట్టుకుంటున్నా మీకూ కావాలా?" అంటోంది దీపం.

"ఇప్పుడే తాగొచ్చా నువ్విచ్చే టీ నీ స్నేహితుడిచ్చాడు.."

"ఓహో.. వెంకట్రామయ్య గారింటికి వెళ్ళొచ్చారా?" ఆయన్ని పిలుద్దామని అనుకుంటూనే అలా అయిపోతోంది." అంది ఏదో చాలా పెద్ద నేరం చేసినట్టు...

ఆయనేమన్నాడు ఏమిటీ అని అడక్కుండా ఆమె టీ పెట్టుకోడానికి లోపలికి పోయింది.

ఎవరో పిలిచే గంట మోగిస్తున్నారు. రెండు నిమిషాలు పట్టించుకోకుండా వుంటే దీపమే చూసుకుంటుంది. తనూ అలాగే అనుకుంది కాబోలు నాలుగు సార్లు గంట మోగే దాకా రాలేదు. ఎప్పుడు చీరె మార్చిందో ఎప్పుడు మొహం కడిగిందో, ఎప్పుడు చిరునవ్వుల లిప్‌స్టిక్ వేసిందో వచ్చి తలుపు తీసింది... "తలుపు తీసే వుంచండి అనూ, పద్మా కూడా వస్తారు" అని వచ్చినామెని లోపలికి తోడ్కొని పోయింది.

తంబురా శ్రుతి చేస్తోంది... వచ్చిన అమ్మాయి కాస్త దగ్గి గొంతు సవరించుకుని "అనూ వచ్చే దాకా కబుర్లు చెప్పుకుందామా?"అంటోంది. అవే కబుర్లు... మొన్న చూసిన సినిమా, నిన్న చదివిన పుస్తకం, వాళ్ళట్లా...వీళ్ళిట్లా... నవ్వులు... దీపానికి నవ్వొస్తే ఆగదు. కళ్ళంట నీళ్ళొచ్చి కడుపులో మెలిపెట్టేదాకా అట్లా నవ్వుతూనే వుంటుంది. మళ్ళీ తనతో అంతగా నవ్వదు.

"శ్రీరంగపుర విహార..." కృతి మా నాన్నకి చాలా ఇష్టం. బృందావన సారంగ రాగం. సుబ్బులక్ష్మి పాడితేనే వినాలని చెప్పేవాడు నాన్నకి వొంట్లో అసలేం బాగాలేదు. పదిరోజులు సెలవు పెట్టి ఇక్కడికి తీసుకొద్దామని వుంది. మీ దగ్గర ఆ రికార్డు వుందా?" అంటోంది వచ్చినావిడ. నెలరోజులుగా సంగీతం నేర్చుకుంటోంది దీపం దగ్గర.

జీతం నష్టం మీద సెలవు పెట్టి తండ్రిని తీసుకొచ్చి సంగీతం కూడా వినిపిస్తోంది. ఎంత మంచి కూతురో! మనకీ వున్నారు సంతానం. ఆదివారాలు కూడా ఫోన్ చెయ్యడానికి తీరని వాళ్ళు... ఎవరి బ్రతుకులు వాళ్ళవి. ఒకరి గోల ఒకరికెందుకు? ఆదినారాయణ అన్నాడు పొద్దున.. అతని కోడలు తన తండ్రికి ఘనంగా డెబ్బయ్యో పుట్టిన రోజు చేసిందట. తన పుట్టిన రోజుకు కనీసం కొడుకు ఫోన్ చేస్తే పక్కనున్నా గ్రీట్ చెయ్యడట. సోమరాజు అల్లుడు తను వెడితేసరిగ్గా మాట్లాడడట. కృష్ణమూర్తి కొడుకూ, కూతురూ ఇద్దరూ ఇద్దరేనట. రామారావు కూతురు ఎంతమంచిదో! తల్లీ తండ్రీ వివాహ స్వర్ణోత్సవాలు ఘనంగా చేయించిందట. వ్రతాలు, అభిషేకాలు ఒకటే సందడట. ఆ పిల్ల వాళ్ళమ్మకి గాజులు కొనిపెట్టిందట.. అంతా ఎంత బాగున్నారో! మనకే ఎందుకిట్లా? అని సోమరాజు యాష్టపడ్డాడు. అవునూ అస్తమానూ ఇలాగే సణుగుతూ వుండే ఏడుపుగొట్టు సుబ్బారావు వారం రోజులనించీ కనపడ్డం లేదు వాకింగ్ మానేసినట్టున్నాడు. లేదా ఏమైనా జబ్బు చేసిందో!

దీపానికి ఇవ్వన్నీ పట్టవు. "ఒకరు మనని పట్టించుకోలేదని ఏడవటమేమిటి, మనమే ఒకళ్ళని పట్టించుకుంటే పోలా?" అని కళ్ళెగరేస్తుంది. చాలా నిరాసక్తత మనిషికి. యంత్రంలా పనిచేసుకుపోతూ వుంటుంది.

వచ్చారు మరో ముగ్గురు సాపాసాలు. వాళ్ళకి అన్నమాచార్య కీర్తనలే నేర్పాలట. ఈ అన్నమాచార్య కీర్తనలకి ఇంత క్రేజేమిటో! జనాలకి ఏ పిచ్చి పడితే అదే పిచ్చి... కుర్చీ దగ్గరగా లాక్కుని మరీ టీవీ చూడాలి. శబ్దం పెరిగిందో చూపుల బాణం సూటిగా కళ్ళలో గుచ్చుతుంది... టీవీలో మాత్రం ఏవుందీ? నలుగురు కూచుని ఒకేరకమైన సోది. అంతా డొంకతిరుగుడు... లోపల్నించీ అన్నమాచార్యుడు ఆగి మళ్ళీ నవ్వులు... తనకన్న చిన్న వాళ్ళతో సమానంగా, ఇంకా వాళ్ళకన్నా ఎక్కువగా... అన్నమాచార్యుడుకి విరామం పెట్టి లలిత సంగీతం ఎత్తుకుంది. అందులోనే మైక్రోవేవ్ లో ఏదో అయిపోయిన హెచ్చరికలు..

మళ్ళీ ఎవరో తలుపు తోసుకుని... పక్క ఫ్లాట్లో నల్లపిల్ల మీరీ... చేతిలో స్వీట్ల డబ్బాతో...

అంతా తల్లి పోలికే.. తండ్రి ఎంత బావుంటాడో! బంగారు తండ్రిలా తెల్లగా వుంటాడు. ఏరి కోరి ఓ నల్ల కోతిని చేసుకున్నాడు. దాని పేరు ఏదో వుంటే, పాయల్ అని పిలుస్తాడు. దీని పేరేమిటో గానీ ఇది మీరీ. స్వీట్లెందుకు తెచ్చినట్టో? దీపానికి స్వీట్లంటే మహా ఇష్టం. అందుకే కాబోలు ఈ కోతిపిల్ల 'మీరీ' అన్నా ఇష్టం.

"తీసుకోండి తాతయ్యా! ఇవ్వాళ మా అమ్మ పుట్టినరోజు. స్కూల్ నించీ వస్తూ నేనే తెచ్చాను చాలా ఫ్రెష్‌వి" అంది.

"థాంక్స్. నాకు స్వీట్లు అంత ఇష్టం వుండవు?" అని ఆ పిల్లతో మాట్లాడ్డం ఇష్టం లేనట్లు మొహం తిప్పేశాను.

ఆ తల్లీ కూతుళ్ళిద్దర్నీ చూస్తే తనకి ఒళ్ళు మంట. ఇద్దరికిద్దరే ఎప్పుడూ ఎగిరెగిరి పడుతూ వుంటారు. అయిన దానికీ కాని దానికీ పళ్ళన్నీ బయటపెట్టి నవ్వుతూ వుంటారు. ఈ పిల్లకోతి పళ్ళకి బ్రేస్‌లు కూడా! మన దీపానికి తొమ్మిదేళ్ళదీ స్నేహితురాలే, తొంబై ఏళ్ళదీ స్నేహితురాలే... లోపల ఎవరో పాట అందుకున్నారు... "కాస్త ముందు తెలిసినా ఈ మందిరమిటులుండేనా" పాట బాగుంది.... మెత్తగా గుండెలోకి దిగుతోంది.... పాడేది దీపమే.. ఆ గొంతులో మెత్తదనం ఇన్నాళ్ళెట్లా దాచుకుని కాపాడుకుందో... తరువాత మళ్ళీ అన్నమాచార్యుడు ప్రవేశించాడు. అన్నమాచార్యుడిని తలుచుకుంటే సినిమా గుర్తొచ్చి కడుపులో వికారపెడుతుంది.... మరీ వీధిలో పడేశారు ఆయన్ని పాపం!

సంగీతం ఆగిపోయింది. కబుర్లు... పద్మ చీరె బాగుంది. అనూ వాళ్ళ పిన్ని స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని కూతురి పిల్లని చూసిపెట్టడానికి అమెరికా పోతోంది. స్వచ్ఛంద పదవీ విరమణ లాగే స్వచ్ఛంద జీవిత విరమణ చేస్తే బాగుండు...

టూత్ బ్రష్షూ, కాఫీ మగ్గూ, రేజరూ, ల్యాదరూ, షవరూ, వాణ్ణి వీడూ వీణ్ణి వాడూ తిట్టిపోసుకునే వార్తాపత్రికలూ. నూనె లేని కొలెస్టరాల్ పెరగని ఉపాహారం... మధ్యాహ్నాం భోజనం. సాయంత్రం టీ, కృత్రిమ చక్కెర... రాత్రి కాస్త బీరూ, చల్లారిపోయిన భోజనం వెచ్చచేసుకోడానికొక మైక్రోవేవూ... వాకింగ్ మిత్రుల కష్టాలూ... వాళ్ళ మోకాళ్ళ నొప్పులు, బీపీ హెచ్చుతగ్గులు షుగర్ లెవల్లు, ప్రోస్టేటు కష్టాలు.. డెంచర్ కష్టాలు, ప్రపంచీకరణ కష్టాలు, మానవతా విలువలు పడిపోయాయని నిట్టూర్పులు, పిల్లల కృతజ్ఞతారాహిత్యం, పనిమనుషులు దొరక్కపోడాలు, పెళ్ళాల జబ్బులు, అయ్యో అయ్యో! ఇంకా నయం దీపానికి జబ్బుల్లేవు..

సాహాసాలు సెలవు పుచ్చుకున్నారు. దీపం టీవీ దగ్గరికి చేరి సీరియల్లో లీనమైంది. సీరియళ్ళని బాగా తిడుతుంది. కానీ చూస్తుంది. దీపానిదీ కంప్యూటరైజ్డ్ దినచర్యే. అయితే ఏం? దాన్ని ఆస్వాదిస్తుంది. నయంకాని జబ్బుని నవ్వుతూ భరించమన్నారు కదా విజ్ఞులు. ఏమిటో ఈ మధ్యన విజ్ఞులు ఎక్కువ గుర్తొస్తున్నారు. ఇన్నేళ్ళూ ఏమైపోయారో ఏమో!

ఫోన్ పిలుస్తోంది. నాలుగు రింగులదాకా ఆమె తీస్తుందని చూశాడు. ఆమె కూడా అదే అనుకుని వుంటుంది. 'ఫోనైనా తియ్యవా? అంత బద్ధకమా? రాజసమా?' అన్నట్టు చూసింది.

"సుశీలక్క లేదాండీ..."

అమ్మయ్య! టీవీ కట్టేసి కార్డ్లెస్ పుచ్చుకుని అవతలి గదిలోకి పోయింది. ఫ్రిజ్‌లోనించీ

బీరు సీసా తెచ్చుకున్నాడు. అక్కడ సిగరెట్ తాగితే చంపేస్తుంది. సిట్ ఔట్‌లోకి సీసాతో సహా పలాయనం.. పోరాటమో, పలాయనమో ఏదో ఒకటి చెయ్యాలి కదా మరి. ప్రస్తుతానికి పలాయనమే.. అక్కా చెల్లెళ్ళ సంభాషణ ఇప్పట్లో తెగదు కనుక నింపాదిగా సేవించవచ్చు. మరదలు మంచిది. ఈ టైంలోనే ఫోన్ చేస్తుంది. మరొక సీసా ఛిల్ చేసుకోవచ్చు, పొద్దున షాపులో కొత్త కార్టన్ సీల్ తీయించి నాలుగు సీసాలు తెచ్చి బట్టల బీరువాలో అడుగున ప్లాస్టిక్ కవరులో దాచాడు. స్వేచ్ఛలేని బ్రతుకు? బీరు చల్లబడింది బాగా... తాజాగా బాగుంది. దీపం మాట్లాడ్డం అయిపోయినట్టుంది. పమిట చెంగు ముక్కుకి అడ్డుపెట్టుకుని సిట్ అవుట్‌లోకి తొంగి చూసి, లోపలికి పోయింది. ఇక భోజనం కానిచ్చి పుస్తకం పట్టుకుని పడుకుంటుంది. ఆల్ ఈజ్ వెల్ విత్ హర్... "నీకేమయిందో!" అన్నాడు లోపలివాడు. ఏడుపొచ్చింది. పోరా పో అనేసి లోపలికి వచ్చాడు. ఒక్కసారి కడుపులో తిప్పినట్టయింది. చల్లని గ్లాసు పట్టుకోడం మూలానో ఏమో చెయ్యి తిమ్మిరెక్కినట్లైంది. భూకంపం వచ్చినప్పటిలా ఒళ్ళు తూలింది. ఏమిటో అవుతోంది. కొంపతీసి స్టేల్ బీరుగాని ఇవ్వలేదు కదా షాపాయన?

దీపం భోజనానికి కూచున్నట్లుంది. పోనీ తను కూడా వెళ్ళి తినేస్తేనో? తినేలా లేదు పరిస్థితి. ఇప్పుడు వాష్ బేసిన్ దగ్గర వాంతి చేసుకుంటే బావుండదు. తను తింటోంది కదా? బాత్ రూమ్ కేసి నడుస్తుంటే మొహమంతా చెమటలు. ఒళ్ళంతా చెమటలు. ఏమో అవుతోంది. వచ్చి సోఫాలో వెనక్కి జారబడి కూచుని కళ్ళు మూసుకున్నాడు. ఇందాక స్వచ్ఛంద జీవిత విరమణ గురించి అనుకున్నాడు. ఇప్పుడు ఆకస్మిక జీవిత విరమణా? సరైన సమయానికి చచ్చిపొమ్మన్నారు కదా విజ్ఞులు! బావుంది. ఇలా దీపం చేతుల మీదుగా దాటిపోవడం! తనకేం ఫరవాలేదు. తట్టుకుంటుంది. అన్నింటికి సమర్థురాలే... క్షణాల మీద పిల్లల్ని పిలుస్తుంది. 'డిస్పోస్ ఆఫ్ ద బాడీ' అంటుంది. మధ్య మధ్యలో వచ్చి తనేం చేస్తున్నాడో, వున్నాడో, పోయాడో చూసే పని తప్పుతుంది. కానీ చూసింది. చూసి రెండంగల్లో సెల్ ఫోన్ అందుకుంది.

నిద్ర, మగత, ఏవో కలలు, జ్ఞాపకాలు.... మొదట్లో ఇట్లా వుండేదా? తను ఒక్కసారిగా ఏమీ మారలేదు. క్రమక్రమంగానే మారింది. పెద్ద చదువూ, నిలబెట్టే అందం లేని చామనచాయ సుశీల! తన ఇంట్లో అందరిదీ తెల్లని చర్మం.. నిజానికి తన కుటుంబం లోనూ ఆడవాళ్ళకి పెద్ద చదువు లేదు. అయినా సుశీలంటే చిన్నచూపు... మొదట్లో తలవంచుకు పోయే సుశీల... "మీ ఇంట్లో వాళ్ళకి తెల్ల తోలు చూసుకుని విరగబాటు. అంతకన్న ఇంకేం లేదు" అంటూ ఒకరోజు పొద్దున్నే ఫస్ట్ బస్‌కి పుట్టింటికి వెళ్ళి తంబురా తెచ్చిన సుశీల...

"చస్తున్నాం దీని సంగీతంతో." నొసలు చిట్లిస్తూ అమ్మ... సుశీల చూడకుండా

వెక్కిరించిన చెల్లి... తనకి నవ్వొచ్చింది. వంట చేసి, ఇల్లు సర్ది పనంతా అయ్యాక డాబా మీదకి వెళ్ళి పాడుకునే సుశీల... "ఇక్కడ సంగీతం నేర్పబడును" (డి సుశీల డిప్లొమా ఇన్ వోకల్ కర్నాటిక్ మ్యూజిక్) ఉన్నట్టుండి ఒక రోజు గేటుకు తగిలించిన అట్ట.

"మనింటిపేరు 'పి' కదా 'డి' అని పెట్టావేమిటీ" అంది చుట్టపు చూపుగా వచ్చిన అక్కయ్య. "నా డిప్లొమా ఆ పేరుతోనే వుందికదా" అని అమాయకంగా మొహం పెట్టేసింది. సుశీలకి డిప్లొమాయే కాదు డిప్లమెసీ కూడా వుంది.

ససరిరిగగమమ...పపదదనినిసస... రోజూ సాయంత్రం ఇంటికొచ్చేటప్పటికి పిల్ల గొంతులు ఒకటీ రెండూ మూడూ పది....

రేడియో ఆడిషన్‌లో సెలెక్టయ్యా.. పిల్లాడిని హాస్పిటల్కి తీసుకుపోతున్నా... పిల్లకి హోమ్ వర్క్ చేయించాలి.. వాళ్ళని సినిమాకి తీసుకుపోతున్నా... పరుగు పరుగు... పుస్తకాలు చదువు పరీక్షలు.. నాకూ డిగ్రీ వచ్చేసిందోచ్...

"దీన్ని ఆపడం మనతరం కాదు.." అమ్మ

"ఆపడం ఎందుకమ్మా?"

"మన పిల్లల స్కూల్లో నాకు ఉద్యోగం ఇచ్చారు. రెండేళ్ళు చేస్తే ప్రయివేట్‌గా బి ఎడ్ చెయ్యచ్చంట... ఆ సంగతి వాళ్ళే చూసుకుంటామన్నారు. ఎల్లుండి చేరిపోతున్నా... నాకెందుకిచ్చారో తెలుసా... కల్చరల్ ప్రోగ్రాములయితే పిల్లలకి పాటలవీ నేర్పించడానికి పనికొస్తానని"

"వాడికి ప్రమోషన్లొచ్చాయి... జీతం పెరిగింది. నీకెందుకే ఉద్యోగం? ఇంతోటి జీతానికి. ఆ ట్యూషన్లేవో చూసుకోక?' అమ్మ.

"ఉద్యోగం మనిషి ధర్మం కదా అత్తయ్యా? ఈ జీతం ఎప్పుడూ ఇలాగే వుండదు. నవ్విన నాపచేన్లు పండుతాయని వినే వుంటారు.. ఆయన ప్రమోషన్లతో పాటు ఖర్చులూ పెరిగాయి కదా?" అని ఆ పెరిగిన ఖర్చులేమిటో తెలిసేలా అత్తగారి మొహంలోకి గుచ్చి చూసింది. ఇక ఎవరు ఆపుతారు దీన్ని?

పోట్లాటలు లేవు... అరుపులు, కేకలు లేవు.... కానీ మనుషుల మధ్య అతి పల్చని గాజుగోడ మొలిచింది. అంతా బాగానే వుంటుంది. అటూ ఇటూ అంతా స్పష్టంగా కనపడ్డట్టే వుంటారు. మాటలూ వినపడ్డట్టే వుంటాయి. దగ్గరకిపోతేనే గోడ తగిలి మొహం పగులుతుంది. మొహం పగలాలేగానీ గోడ పగలదు. అంత దిట్టమైన గోడ.

ప్రమోషన్లతో స్కాచి వడబోసిన వ్యాపార స్నేహాలు, ఆహో, ఓహోలు, ఆడంబరాలు డిన్నర్లు, విహారాలు, సూట్లు, టైలు, బూట్లు, మేజోళ్ళు జతలు జతలు.. బ్యాటరీ అయిపోయి ఆరిపోయిన లైట్లు... పెద్దగా ఊదీ ఊదీ పగిలిపోయిన గాలిబుడగ... ఆడీ ఆడీ అలసిపోయి ఆగిపోయి, మరమ్మతుతోనైనా మళ్ళీ ఆడుతుందో లేదో తెలియని గడియారం.

కళ్ళు మూతపడుతూ విడుతూ...

ఎదురుగా కుర్చీలో పసుపురంగు చుడీదార్ వేసుకున్న అమ్మాయి. హేమంతంలో విరబూసిన చేమంతి మడిలా వుంది. ఆమె పక్కన పళ్ళకి బ్రేసెస్‌ల పిల్ల...

"అమ్మ ఇప్పుడే క్యాంటీన్‌కి కాఫీ కోసం వెళ్ళారు." అని, "మీరే... నర్సుని పిలుచుకురా పో" అని పిల్లకి చెప్పింది చేమంతి మడి.

మంచం పక్క చిన్న స్టూలు మీద వున్న సెల్ మోగితే తీసి "కళ్లు తెరిచి చూశారు. మాట్లాడతారేమో" అంటూ ఫోన్ ఇచ్చింది. పిల్లలకి వుండదా ఆదుర్దా? వున్నట్టే వినిపడుతున్నె గొంతులు. మూతలు పడుతున్నాయి కళ్ళు... మళ్ళీ విడుతున్నాయి. నెమ్మదిగా తలుపుతోసుకుని లేతాకుపచ్చ చీరె లోపలికి వచ్చింది. ఆమెతో పాటు కాస్త వెలుగూ వచ్చింది.

"ఇంక నువ్వెళ్ళు పాయల్.. పాపం రెండు రోజులుగా నాతోనే వున్నావు. ఇవ్వాళ ఆఫీస్‌కి వెళ్ళు. భోజనం అయ్యాక వెంకట్రామయ్య గారు కాసేపు వచ్చి కూచుంటానన్నారు..." అంది ఆకుపచ్చ చీరె. అప్పుడప్పుడే నాటుకుని కాస్త కాస్త తల ఎత్తుతున్న వరి చేనులా వుంది. ఆమెకి ఆకుపచ్చ చాలా ఇష్టం. ఆకుపచ్చలో ఎన్ని ఛాయలుంటాయో అన్ని చీరెలున్నాయి.

"విశ్రాంతిగా పడుకోవాలి మాట్లాడకూడదు.." అని చెప్పి బ్యాగ్‌లో తెచ్చుకున్న పుస్తకం చదువుకుంటోంది.

ఎప్పుడో మళ్ళీ తలుపు తెరుచుకుని ఒక శ్వేతాంబరుడు లోపలికొచ్చాడు.

"ఎలా వున్నారు?" అన్నాడు నుదుటిమీద చెయ్యివేసి. అయన చెయ్యి వెచ్చగా వుంది. "ఎల్లుండి ఇంటికెళ్ళచ్చు" అంది హరితం... వెళ్ళేం చెయ్యాలి?

"నేను చూస్తూ వుంటాలే నువ్వు కాంటీన్‌కి వెళ్ళి భోజనం చేసిరా అమ్మా! బయట్నుంచి తేనివ్వరని కానీ, లేకపోతే కావ్యమ్మ పంపించేది"

కుర్చీ దగ్గరగా లాక్కుని కూచున్నాడు. పుస్తకంలో పేజీలు తిప్పుతున్నాడు. తను వింటానంటే చాలా చెప్తాడు. తను పనిచేసిన ఉద్యమాలు, పొందిన శిక్షలు తన ఊరికి చేసిన బాగులు, తన పొలానికి చేసిన సేవలు, దానిమీద కురిపించిన ప్రేమ, పిల్లల్ని అమ్మనివ్వకుండా తను కాపాడుకున్న తన చిన్న ఇల్లు, తన జానకమ్మ, ఆమె తనకిచ్చిన 'ఊతం' ఇప్పుడు జానకమ్మకి ఒకటే కాళ్ల నొప్పులా మరి, రోజూ సాయంత్రం తను కాసేపు అదేదో తైలం మర్దనా చేస్తాడు. అప్పుడు ఆవిడకి కాస్త నెమ్మది... రెండు నెలలుగా ఆవిడ బెజవాడలో వుంది. కూతురికి ఏదో ఆపరేషన్ అయింది... మనవరాలు పిల్లకోసం తనేమో ఇక్కడికొచ్చాడు. ఒకేచోట వుండాలనేముందిలే! చెరొక సెల్లు కొనుక్కున్నాం. పొద్దునా సాయంత్రం మాట్లాడుకుంటాం. ఏదో అప్పుడు ఊరికీ, దేశానికీ చేశాం. ఇప్పుడు ఉన్న

కాస్త ఓపికతో పిల్లలకైనా సాయం చెయ్యాలి కదా? ఏమంటారు? అట్లా మాట్లాడుతూ వుంటాడు. వినే మనిషి మొహంలో విసుగు కనిపిస్తే "సరే లెండి.. మీరు చెప్పండి ఏమన్నా కబుర్లు" అంటాడు. ఈ మనిషి ఎనభై రెండేళ్ళు జీవితాన్ని ఎట్లా లాగాడు? ఒక్క నిరుత్సాహపు మాట రాదేం ఆయన నోట? ఏమిటా రహస్యం? హరితానికి మాత్రం విసుగు లేదా? చక్కగా స్నానం చేసి గంజి పెట్టిన ఇస్త్రీ చీరె కట్టి పమిట జారకుండా పిన్ను కూడా పెట్టుకుని వస్తూ ఒక పుస్తకం కూడా తెచ్చుకుంది... తనకి దిగులూ, విచారమూ లేవా? ఎంత నిబ్బరమో మనిషికి... ఇంటికి వెళ్ళడం తప్పేలా లేదు, కనుక వెళ్ళంగానే అడగాలి... అసలు ముందు ఈ సతీ సావిత్రికి థాంక్స్ చెప్పాలేమో కదా? ఇటువంటి చిన్న చిన్న మర్యాదల గురించి మహా పట్టుదల తనకి.. అయినా పోయేవాణ్ణి పోనీకుండా జుట్టుపట్టుకుని లాక్కొచ్చినందుకు థాంక్స్ అక్కర్లేదేమో! కాస్త నాటకీయంగా (పాత సినిమాలలో నాగేశ్వర్రావులాగా) "నన్నెందుకు బ్రతికించావు సుశీలా?" అంటే ఏమంటుందో! తనకి తెలుసు ఏమంటుందో! "నువ్వు దాచుకున్న బీరు సీసాల చుట్టూ నీ ఆత్మ తిరుగుతూ వుంటుంది కదా! అవి అయిపోయే వరకూ నువ్వు వుండాలి మరి..." అంటుంది. కళ్ళల్లోనే కాదు, నాలుక మీద కూడా సిద్ధంగా వుంటాయి బాణాలు. అదొక అక్షయ తూణీరం.. తూణీరం భోజనం చెయ్యడానికి వెళ్ళింది.

కళ్ళు తెరిచాడు.

"మీకు బాగా స్పృహ వచ్చేసింది. నర్సుని పిలవనా? ఏమైనా తాగడానికి ఇమ్మంటుందేమో.." అన్నాడు శ్వేతాంబరుడు.

తల అడ్డంగా ఊపి "చాలా విసుగ్గా వుంది. పొలిమేర దాకా పోయి వెనక్కొచ్చాను ఎందుకో?"

"మీరు పొలిమేర దాకా పోలేదు.. కొంచెం దూరమే పోయారు. అందుకే గభాలున వెనక్కు లాక్కొచ్చాం. మా బిడతని చూసుకోడానికి జానకమ్మ ఒకావిడని మాట్లాడి తీసుకొస్తోంది. మిమ్మల్ని ఇంట్లో దించి మా పూరెళ్ళిపోతాం." నవ్వాడు.

తలుపు తోసుకుని నల్లని ప్యాంట్‌లో తెల్లని షర్ట్ టక్ చేసుకున్న ఆకారం ఒకటి... దగ్గరగా వచ్చింది. సుబ్బారావు! బాగానే వున్నాడు. నవ్వుటయే ఎరుంగని మహా మహితాత్ముడు... నవ్వు మొహంతో వున్నాడు. నదులు సాగరంబులు.. ఏమిటో జ్ఞాపకం లేదు పద్యం... అవన్నీ ఏకము అవుతాయేమో! తేటగా వున్నాడు. జబ్బుపడి బాగా నయమైన వాడిలా... ముసలాయన ఒక స్టూల్ తెచ్చి ఆయన్ని కూచోబెట్టాడు.

"ఏమై పోయారిన్నాళ్ళూ?"

"మన పేటలో గవర్నమెంట్ హైస్కూల్ హెడ్మాస్టారు టెంత్ క్లాసు పిల్లలు లెక్కల్లో బాగా వెనకపడి వున్నారని దిగులుపడి పోతుంటే నేనే చెప్తున్నాను వారం రోజుల్నించీ

సాయంత్రాలు ప్రయివేటు క్లాసుల్లాగా... వాళ్ళ మాస్టారు సెలవు పెట్టి వెళ్ళాడట పాపం... వాళ్ళు ఇంగ్లీష్ లోనూ చాలా వెనుకపడే వున్నారు. వాకింగ్‌లు పొద్దున చేస్తున్నాం గా చాల్లే... సుశీలగారు ఇంగ్లీష్ చెబుతారేమో అడగాలనుకున్నా... ఇంతలో మీరేమో ఇలా... సరేలెండి మీకు బాగయింది. సంతోషం."

పడుకున్న వాడు లేచి దిళ్ళకానుకుని కూచున్నాడు.

"సుశీలకి ఇంగ్లీషేం వచ్చు? సాపాసాలు తప్ప... అంతా ప్రయివేటు చదువు. చిన్నప్పటినించీ నేను ఇంగ్లీష్ మీడియం. ఎప్పుడూ ఇంగ్లీషులో ఫస్టొచ్చేవాణ్ణి... నేనే చెప్తా..." అనేశాడు గబిక్కిన.

సుబ్బారావు ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

మళ్ళీ ఎవరో లోపలికి... స్కూల్ యూనిఫామ్‌లో మీరీ.

"ఇవ్వాళ స్కూల్లేదోచ్. అమ్మమ్మ దగ్గర వుందామనొచ్చా.. వుండనా ఇంటికి వెళ్ళనా? ఓ! తాతయ్యకి బాగా మెలకువ వచ్చినట్టుందే!" అంటోంది.... ఆ పిల్ల నవ్వు బాగానే వున్నట్టుంది. *

*(పాలపిట్ట, అక్టోబరు 2011)*